## ప్రభుత్వ సంక్షేమ పథకం

# చేరని ఇల్లు లేదు

- తండాలను జీపీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దే
- జుక్కల్ ఎమ్మెల్యే షిండే
- గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం
- మంగళ హారతులతో స్వాగతం పలికిన మహిళలు



ఓటర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

పిట్లం, నవంబర్ 6: రాష్ట్రంలో హనుమంతుడు లేని ఊరు, సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకం అందని ఇల్లు లేదని బీఆర్‌ఎస్ పార్టీ జుక్కల్ ఎమ్మెల్యే అభ్యర్థి హన్మంత్‌షిండే అన్నారు. ఆయన సోమవారం మండలంలోని బొల్లక్‌పల్లి, మద్దెల్‌చెరు, బండపల్లి, గౌరారంతండా, కోమటి చెర్వుతండా, బొగ్గులకుంటతండా, గౌరారం, రాంపూర్, కుర్తి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు మహిళలు మంగళహారతులు పట్టగా.. యువకులు, ప్రజలు భాజా భజంత్రీలతో ఘన స్వాగతం పలికారు. బండపల్లిలో మహిళలతో కలిసి ఎమ్మెల్యే షిండే నృత్యం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తండాలను జీపీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. ప్రతి మండల కేంద్రంలో బంజారా భవన్ నిర్మించడంతోపాటు హైదరాబాద్ నగరంలో విశాలమైన బంజారా భవన్‌ను నిర్మించి వారి అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే గిరిజన తండాలకు రహదారులు, తాగునీటి వసతి ఏర్పడినట్లు తెలిపారు. మండలంలోని గౌరారంగేటు నుంచి గౌరారంతండా వరకు డబుల్ రోడ్డు, గౌరారంతండా నుంచి బండపల్లి వరకు కొత్తగా బీటీరోడ్డును మంజూరు చేసినట్లు తెలిపారు. ఎన్నికల అనంతరం మార్చి నెల నుంచి రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం అందజేస్తామని చెప్పారు. ఎన్నికల అనంతరం మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆసరా పింఛన్లు, రైతుబంధు డబ్బులను క్రమంగా పెంచుతామని తెలిపారు. రైతు మరణిస్తే వారం, పది రోజుల్లోపు బాధిత కుటుంబానికి రూ.ఐదు లక్షల బీమా డబ్బులు అందజేస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో కుర్తి గ్రామానికి హైలెవెల్ బ్రిడ్జిని నిర్మించినట్లు తెలిపారు. దీంతో వారి కష్టాలు దూరమయ్యాయని అన్నారు. తాను నియోజకవర్గ బిడ్డనని, తనను మరోసారి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వాసరి రమేశ్, నాయకులు రజినీకాంత్‌రెడ్డి, విజయ్, అన్నారం వెంకట్ రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సాయిరెడ్డి, శపథంరెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, హన్మంత్‌రావు, నర్సాగౌడ్, జగదీశ్, జొన్న శ్రీనివాస్‌రెడ్డి, కరీం, షఫీ, బుడాల నవీన్, సంతుసేట్, సర్పంచులు నారాయణరెడ్డి, భాగ్యమ్మ, అనసూయ, రవి, గ్రామస్థాయి నాయకులు శ్రీహరి, గుంటి రాములు, పుట్టి రాములు, రామిరెడ్డి, శంకర్, హన్మంతురావు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



బండపల్లిలో మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు



గౌరారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

## ఒక నామినేషన్ దాఖలు

మద్నూర్, నవంబర్ 6: జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గానికి సోమవారం ఒక నామినేషన్ దాఖలైందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి మనుచౌదరి తెలిపారు. బీజేపీ తరఫున అరుణతార నామినేషన్ వేశారని అన్నారు. కాగా.. ఇప్పటివరకు రెండు నామినేషన్లు దాఖలు అయ్యాయని అన్నారు. 10వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేసేందుకు సమయం ఉన్నదని తెలిపారు.

## జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

పెద్ద కొడప్‌గల్, నవంబర్ 6: జిల్లాస్థాయి అండర్–14, –17 కబడ్డీ పోటీలకు మొత్తం 48 మంది విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ధర్మేందర్ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎంపిక పోటీలను నిర్వహించామని అన్నారు. పెద్దకొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్ మండలాల్లోని ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. అండర్–14, 17 విభాగాల్లో బాలురు, బాలికల జట్లకు 48 మందిని ఎంపిక చేశామన్నారు. ఎంపిక కార్యక్రమంలో హెచ్‌ఎం కమల, పీఈటీలు ఫయాజ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

## హన్మంత్‌షిండే విజయం సాధించాలని పూజలు



కౌలాస్‌నాలా ఎల్లమ్మ ఆలయం వద్ద పూజల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ శ్రేణులు

నిజాంసాగర్, నవంబర్ 6: హన్మంత్‌షిండే ఎమ్మెల్యేగా విజయం సాధించాలని కోరుతూజుక్కల్ మండలంలోని కౌలాస్‌నాలా ఎల్లమ్మ తల్లి ఆలయంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండలంలో ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. జుక్కల్ నియోజకవర్గంలో గడిచిన 65 ఏండ్లలో కానరాని అభివృద్ధి సీఎం కేసీఆర్ హయాంలో పదేండ్లలో జరిగిందని, ప్రతి గ్రామానికీ రహదారి సౌకర్యం కల్పించిన ఘనత హన్మంత్‌షిండేదే అన్నారు. మరోసారి అవకాశం కల్పించి ఎమ్మెల్యేగా హన్మంత్‌షిండేను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు నీలూపటేల్, సాయాగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మాధవ్‌రావు దేశాయ్, సొసైటీ చైర్మన్ శివానంద్, సర్పంచులు రవిపటేల్, కపిల్‌పాటిల్, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు తదితరులు నాల్గొన్నారు.

## పోలింగ్ బూత్‌ల పరిశీలన



వెల్గనూర్‌లో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న గిర్దావర్

నిజాంసాగర్, నవంబర్ 6: మండలంలోని అచ్చంపేట, వెల్గనూర్, జక్కాపూర్ గ్రామాల్లో ఉన్న పోలింగ్ బూత్‌లను గిర్దావర్ అంజయ్య సోమవారం పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల వద్ద వసతులు, మూత్రశాలలు, ఓటు వేసేందుకు వచ్చే వారిలో దివ్యాంగులు ఉంటే వారి కోసం ర్యాంపులు ఉన్నాయా అనే విషయాలను తెలుసుకున్నారు. వెల్గనూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగాప్రసాద్ తదితరులు ఉన్నారు.

## నాణ్యమైన విద్యను బోధించాలి

నిజాంసాగర్, నవంబర్ 6: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను బోధించాలని మండల విద్యాశాఖధికారి దేవీసింగ్ అన్నారు. మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో ఆయా పాఠశాలల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 2023–24 విద్యా సంవత్సరంలో నిర్వహిస్తున్న మొదటి సమావేశం ఇది అన్నారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా బోధనోపకరణాలు ఉపయోగించి విద్యాబోధన చేపట్టాలని సూచించారు. మండల నోడల్ అధికారి అమర్‌సింగ్ మాట్లాడుతూ.. పాఠ్య ప్రణాళిక బోధనలో తప్పనిసరిగా సబ్జెక్టు ప్లాన్‌ను తయారు చేసుకోవాలని, టీఎల్‌ఎంను ఉపయోగించాలని సూచించారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు కొత్త విషయాలు తెలుసుకొని పాఠ్యాంశాలకు అనుగుణంగా విద్యార్థులకు నిత్యం నూతన విద్యాబోధన చేపట్టాలన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పర్యవేక్షించాలని, షెడ్యూల్ ప్రకారం పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఆయా పాశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు వరలక్ష్మి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో దేవీసింగ్